# సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 24 । ఆగస్టు । 2025




**ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు**

పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణ మాసం చివరి శనివారం భక్తుల సంఖ్య భారీగా తగ్గింది.

-8లో



**ఆగని భూ కబ్జాలు!**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో భూ ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.

-8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.360 | రూ.450 |
| రెండోరకం | రూ.200 | రూ.340 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### నమో నారసింహ



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**గుర్రంకొండ:** మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అభిషేకాలు, అర్చనలు జరిపారు. తోమాల సేవ, ఏకాంతసేవ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగు రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొన్నారు.

### జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మహేష్

**పీలేరురూరల్:** స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టులో పోలీస్, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, కుటుంబ తాగాదాల కేసులు, చెక్ బౌన్స్ తదితర కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. కక్షిదారులను పిలిపించి లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి మురళి, ఏపీపీ శారద, సీఐ యుగంధర్ పాల్గొన్నారు.

### ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కేసులు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ నారాయణ

**కలకడ:** యూరియాకొరత చూపించి ఉన్న స్టాకును తరలించి రైతులకు అధిక ధరలకు విక్రయించాలని చూస్తే కేసులు తప్పవని అన్నమయ్య జిల్లా విజిలెన్స్ సీఐ నారాయణ, హెచ్చరించారు. శనివారం కలకడ, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె లోని మన గ్రోమోర్, పుడమికిసాన్, జైకిసాన్ ఎరువుల దుకాణలను విజిలెన్స్ సీఐ, తహసీల్దార్ మహేశ్వరిబాయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. యూరియాతోపాటు ఇతర నిల్వలను నోటీసు బోర్డులో నమోదు చేయాలన్నారు. మండలవ్య వ్యవసాయాధికారిశ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి అమృత్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రక్తం అందుబాటులో ఉంచేందుకు చర్యలు

**రాయచోటి:** జిల్లాలో రోగులకు అవసరమైన రక్తాన్ని నిరంతరం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డీఆర్ఓ మధుసూదన్ రావు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నరసింహ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం 10 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉందని తెలిసిన వెంటనే రెవెన్యూ అసోసియేషన్ స్పందించి 200 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందించేందుకు ముందుకు రావడాన్ని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో పంచాయతీరాజ్, ఇతర ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలు, ఇంజినీరింగ్ కాలేజీల వంటి వర్గాలను కూడా రక్తదాన శిబిరాలలో పాల్గొనేలా ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్దిక్, వైద్య, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన రక్తదానం చేశారు. రక్తదానం చేసిన అనంతరం కలెక్టర్ జాయింట్ కలెక్టర్‌కు పండ్లు పంపిణీ చేయగా, రాజంపేట సబ్ కలెక్టర్‌కు మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి జ్యూస్ అందజేశారు.

# మాన్యం.. భూచోళ్లకు నైవేద్యం

- జిల్లాలో ఆక్రమణలో 1,172 ఎకరాల దేవదాయ భూములు
- 513.44 ఎకరాలతో కోడూరు టాప్
- ఏళ్లతరబడి ఆక్రమణదారుల కబంధహస్తాల్లోనే..
- చెర వీడేదెప్పుడో?


**మదనపల్లె:** జిల్లాలో ఏళ్ల తరబడి దేవదాయ, ధర్మదాయశాఖ పరిధిలోని ప్రభుత్వం గుర్తించిన ఆలయాలకు చెందిన వందల కోట్ల విలువైన మాన్యం భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటికి విముక్తి కలిగించే విషయంలో ప్రభుత్వ వ్యవస్థలు చేష్టలుడిగి చూస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యమో, కొందరి అలసత్వ ఫలితమో కాని వారి వల్లే వివాదాలు కూడా మొదలై న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లకు వెళ్లే పరిస్థితులు వచ్చాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకునే ప్రక్రియలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. దేవుడి ఆస్తులను కాపాడలేని స్థితిలో ప్రభుత్వం ఆచేతనంగా మిగిలిపోతోంది. జిల్లా అధికారులేమో తమశాఖ భూములు ఎన్ని ఆక్రమణలకు గురయ్యాయో లెక్కలు వేస్తూ ప్రభుత్వానికి నివేదిస్తున్నారు కాని, వాటిపై గట్టి చర్యలు మాత్రం ఉండటం లేదు. ఒకటి కాదు, రెండు కాదు వందల ఎకరాల భూములు ఆక్రమణలో ఉండిపోయాయి. వీటి విలువ కొన్నిచోట్ల చెప్పలేనంతగా ఉంది.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో వెలుగులోకి రాని ఆలయాల ఆక్రమిత భూముల వివరాలు వెలుగులోకి వచ్చాయి. . ఆలయాల భూముల ఆక్రమణ విషయంలో జిల్లాలోని కోడూరు అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో 30 మండలాలు ఉంటే ఒక్క కోడూరులోనే 513.44 ఎకరాల ఆలయాల భూములను ఆక్రమించిన ప్రైవేటు వ్యక్తులు తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. ఇంత భారీస్థాయిలో విలువైన భూములు ఆక్రమణలకు గురవుతుంటే ప్రభుత్వ వ్యవస్థల దృష్టికి రాలేదా, వచ్చినా



వీరబల్లి మండలం పుల్లగూరగండిలో ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

చూసీచూడనట్టు పట్టించుకోలేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వందల ఎకరాల భూములు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంటే దేవదాయశాఖకు తెలియకుండా ఉంటుందా?. అలాంటప్పుడు ప్రభుత్వ అధికారులతో ఎందుకు చర్యలు చేపట్టలేదు అన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



**రీసర్వేతో కొత్తగా 799 ఎకరాలు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే దేవదాయశాఖకు లాభాన్ని కలిగించింది. ఆలయాల రికార్డుల్లో లేని దేవదాయశాఖకు చెందిన భూములు ఉన్నట్టుగా జిల్లాలోని 16 మండలాల్లో 799.35 ఎకరాలు వెలుగులోకి వచ్చాయి. నందలూరు మండలంలో 39.07 ఎకరాలు, ఓబులవారిపల్లెలో 60.07 ఎకరాలు, రాజంపేటలో 35.66 ఎకరాలు, గాలివీడులో 182.79 ఎకరాలు, వీరబల్లిలో 26.99 ఎకరాలు, లక్కిరెడ్డిపల్లెలో 36.66 ఎకరాలు, పుల్లంపేటలో 144.87 ఎకరాలు, టి.సుండుపల్లెలో 71.51 ఎకరాలు, రాయచోటిలో 53.16 ఎకరాలు, సంబేపల్లెలో 42.40 ఎకరాలు, చిన్నమండెంలో 24.54 ఎకరాలు, రామాపురంలో 58.04 ఎకరాలు, రైల్వేకోడూరులో 19.01 ఎకరాలు, పెనగలూరులో 0.11 ఎకరాలను గుర్తించారు.

**దేవదాయ భూముల వివరాలు**

| | |
|---|---|
| జిల్లాలోని మొత్తం ఆలయాలు: | 1,316 |
| ఆలయాల భూములు: | 9,761.3 ఎకరాలు |
| తరి భూములు: | 1,468.05 ఎకరాలు |
| డ్రై భూములు: | 7,698.21 ఎకరాలు |
| కొండ-అటవీ భూమి: | 1.34 ఎకరాలు |
| ఇతర భూములు: | 593.70 ఎకరాలు |
| లీజుకు ఇచ్చినది: | 2,556.52 ఎకరాలు |
| లీజు ఆదాయం మొత్తం: | రూ.57.44 లక్షలు |
| ఆక్రమణల్లోని భూములు: | 1,172.24 ఎకరాలు |
| ఇనామ్‌దార్ అనుభవంలో: | 463.99 ఎకరాలు |
| రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది: | 7,353.6 ఎకరాలు |
| పట్టణాల్లో ఉన్న భూములు: | 28.57 ఎకరాలు |
| గ్రామాల్లో ఉన్నవి: | 8,252.4 ఎకరాలు |

**భూముల ఆక్రమణ వివరాలు**

| మండలం | ఎకరాలు |
|---|---|
| చిన్నమండ్యం | 76.25 |
| గుర్రంకొండ | 61.02 |
| కలకడ | 61.01 |
| కలికిరి | 59.03 |
| కోడూరు | 513.44 |
| కురబలకోట | 23.6 |
| మదనపల్లె | 32.16 |
| నందలూరు | 1.25 |
| ఓబులవారిపల్లె | 91.37 |
| పెద్దమండ్యం | 17.13 |
| పుల్లంపేట | 68.92 |
| రామసముద్రం | 19.29 |
| సంబేపల్లె | 95.31 |
| టి.సుండుపల్లె | 23.63 |
| వాయల్పాడు | 23.23 |

**కేవలం 50 మందికి నోటీసులు**

జిల్లాలో 1,172 ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయని దేవదాయశాఖ అధికారుల లెక్కలే చెబుతున్నాయి. అయితే వీటిలో 43.42 ఎకరాల భూములకు సంబంధించి మాత్రమే ఆక్రమణదారులైన 50 మందికి నోటీసులు జారీ చేశారు. రామసముద్రం, బి.కొత్తకోట, కలకడ, గుర్రంకొండ, పీలేరు, రాయచోటి, చిన్నమండ్యం మండలాలకు చెందిన కొంత భూమికి సంబంధించి మాత్రమే నోటీసులు ఇవ్వగా మిగిలిన భూములకు సంబంధించిన చర్యలు లేవు. నోటీసులు అందుకున్న వారిలో ఐదుగురు మాత్రమే స్పందించారని, మిగిలిన వారు స్పందించలేదని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే అధికారుల చర్యలపై ఆక్రమణదారుల్లో ఎలాంటి చలనం లేదన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది.

**కేసులు వేస్తున్నాం**

ఆలయాల భూములను ఆక్రమణదారులపై కఠినచర్యలు మొదలుపెట్టాం. తమశాఖ తరపున ట్రిబ్యునల్‌లో కేసులు వేస్తు న్నాం. భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో గుర్తించేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలనలు పూర్తి చేశాం. వాటి వివరాలతో నివేదికలు సిద్ధం చేశాం. నోటీసులు పొందిన వ్యక్తులు స్పందించకుంటే తదుపరి చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులను ఉపేక్షించే ప్రసక్తే ఉండదు. క్రిమినల్ చర్యలకు వెనకాడం. రీసర్వేలో పలు మండలాల్లో ఆలయాల భూముల విస్తీర్ణం తగ్గడంపై తహసీల్దార్ల వద్ద అప్పీళ్లను దాఖలు చేశాం.

–సీ.విశ్వనాథ్, దేవదాయశాఖ జిల్లా అధికారి

## ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

**ఒంటిమిట్ట:** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో ఆగస్టు 24 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి మేదిని పూజ, మృత్సంగ్రహణం, అంకుకార్పణ ఘట్టాలు నిర్వహించారు. యాత్రికుల వల్ల, సిబ్బంది వల్ల తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాది మూడురోజులపాటు పవిత్రోత్సవాలు జరుపుతుంటారు. పవిత్రోత్సవాలలో భాగంగా ఆగస్టు 24న యాగశాలలో పవిత్ర ప్రతిష్ట, శయానాధివాసం, 25న పవిత్ర సమర్పణ, 26న వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు, పండితులు

## ఇన్‌స్టంట్ పరీక్షా ఫలితాలు విడుదల

**కడప ఎడ్యుకేషన్:** యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలను శనివారం వైవీ యూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలసి మాట్లాడారు. బిఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ ఐదు సెమిస్టర్ల పరీక్షలకు1,012 మంది విద్యార్థులు హాజరు కాగా 977 ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఫలితాల కోసం https:www.yvuexams.in/results.aspx అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆచార్య కృష్ణారావు సూచించారు.

## పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**కలకడ:** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు. శనివారం కలకడ మండల కేంద్రంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.జూలై చివరి వారం నుంచి జిల్లాలో వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు, ఇతర కీటకాలు విస్తరించి మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీజనల్ , అంటువ్యాధులను నివారించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావడం అత్యవసరమని కలెక్టర్ తెలిపారు.ప్రతి శుక్రవారం 'డ్రై డే' గా పాటించాలని తెలిపారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమ అమలుపై ప్రజలందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కలకడ నుంచి తిరిగి వెళుతూ చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై యూనియన్‌బ్యాంక్-కలకడ శాఖ ముందు భాగంలో మురుగునీరు నిల్వ ఉండటం చూసిన కలెక్టర్ జాతీయరహదారి అధికారులకు వెంటనే సమాచారం అందించి తొలగించాలని డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డిని ఆదేశించారు. నీటిలో లార్వాలు వృద్ధి చెందకుండా మలాథియాన్ పిచికారి చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరిబాయ్, సీఐ లక్ష్మన్న, డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్యారీజాన్, విశ్వనాథ, ఎంఈఓ మునీంద్రనాయక్,జావాద్, జిలానీ, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కర్నూలు జాతీయ రహదారిపై నిల్వ ఉన్న నీటిలో మలాథియాన్ పిచికారీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

# డీఎస్సీ ప్రక్రియ ప్రారంభం

**అర్హులందరికీ కాల్ లెటర్లు**

**మదనపల్లె సిటీ:/ గాలివీడు:** పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ -2025లో అర్హత సాధించిన ఉపాధ్యాయ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యాశాఖ సమాయత్తమైంది. ర్యాంకు సాధించిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత లాగిన్ ఐడీల ద్వారా కాల్ లెటర్లు అందుతాయని ఇదివరకే అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్‌లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఇటీవల తీసుకున్న కులధ్రువీకరణ పత్రం, గెజిడెట్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల సర్టిఫికెట్ జిరాక్స్‌లు, 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని వారికి కేటాయించిన తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది. వెరిఫికేషన్‌కు హాజరుకాకముందే సంబంధిత సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది, అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు తప్పని సరిగా హాజరు కావాలి. అలా హాజరు కాని లేదా అర్హత లేని అభ్యర్థుల అభ్యర్థిత్వం రద్దు చేయబడుతుందని అధికారులు స్పష్టం చేశారు.

**వారెవ్వా... రవీంద్రా...!**

ఆయన ఆర్మీ జవాన్. మదనపల్లె సొసైటీకాలనీకి చెందిన రవీంద్ర ప్రాథమిక, ఉన్నత, కళాశాల విద్య ప్రభుత్వ పాఠాలలు, కాలేజీలో అభ్యసించారు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో ఆర్మీలో చేరారు. అక్కడ విధదులు నిర్వహిస్తూనే దూర విద్య ద్వారా డిగ్రీ,పీజీ కోర్సులు పూర్తి చేశారు. 16 సంవత్సరాలు పాటు దేశానికి సేవ చేసి రెండు సంవత్సరాల క్రితం మదనపల్లెకు చేరుకున్నాడు. ఇక్కడే ఉపాధ్యాయ విద్య బీఎడ్ పూర్తి చేశారు. అనంతరం టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) రాసి ఏకంగా 138 మార్కులు సాధించాడు.గత ఏడాది విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేశారు.తనకున్న అర్హతలతో అయిదు టీచర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేశారు. తిరుపతిలోని ఓ కోచింగ్ కేంద్రంలో శిక్షణ పొందారు. డీఎస్సీ పరీక్షల్లో సత్తాచాటారు. ఏకంగా అయిదు పోస్టుల్లోనూ అర్హత సాధించారు. స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రంలో 72.76 మార్కులతో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో 9వ ర్యాంకు సాధించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ గణితంలో 73.32 మార్కులతో 34వ ర్యాంకు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ సైన్సులో 80.75 మార్కులతో జోనల్ స్థాయిలో 88వ ర్యాంకు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ గణితంలో జోనల్ స్థాయిలో 62.59 మార్కులతో 180 ర్యాంకు సాధించారు. దీంతో పాటు సెకండరీ గ్రేడ్ విభాగంలో 84.11మార్కులతో114 ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. ఆయన భార్య రమాభార్గవి రామసముద్రం మండలంలోని జంగాపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు.ఆయన్ను రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్‌ఖాన్, ఎస్టీయు, యుటిఎఫ్ సంఘ నాయకులు అయూబ్‌ఖాన్, రమాదేవి, హేమలతలు అభినందించారు.



భార్య,కుటుంబసభ్యులతో మెగా డీఎస్సీలో సత్తా చాటిన రవీంద్ర

**విద్యార్థులను ఆదర్శ పౌరులుగా తయారు చేయడమే లక్ష్యం**



స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం టీచర్ పోస్టుకు ఆప్షన్ ఇవ్వనున్నాను. విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు వారిని ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తాను. -రవీంద్ర

**మెరిసిన బావాజీ**



మెగా డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో మదనపల్లె పట్టణం విద్యానగర్‌కు చెందిన బావాజీ ఎస్ఏ (హిందీ)లో జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. 86.53 మార్కులు సాధించారు. బావాజీ 2005 లో బీఈడీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఓ ప్రైవేటు పాఠశాలలో హిందీ టీచర్‌గా పని చేస్తున్నాడు. విజయనగరంలో కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్నాడు. భార్య రిజ్వానీ ములకలచెరువు మండలం సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. మొదటి నుంచి కష్టపడి చదవడంతో ర్యాంకు సాధ్యమైందని బావాజీ తెలిపారు.

**సురేష్.. భేష్**



డీఎస్సీ- 2025 ఫలితాల్లో గాలివీడు విద్యార్థి పాడిదాసరి సురేష్ కుమార్ ఎస్టీటీ విభాగంలో 47 ర్యాంక్ సాధించాడు.పట్టణంలోని సలాదివాండ్లపల్లిలో ఉండే పాడిదాసరి గంగులు,అమ్ములు దంపతుల కుమారుడు సురేష్ కుమార్ కష్టపడి చదివి రెండో ప్రయత్నంలో రాణించి టీచర్ పోస్టును సాధించాడు.పదో తరగతి వరకు స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో చదివిన సురేష్ ఇంటర్,టీటీసీ రాయచోటిలోని ప్రభుత్వ కళాశాలల్లో పూర్తి చేశాడు.తండ్రి తిరిగిరాని లోకాలకు పోయినా, తల్లి గల్ఫ్ దేశాలకు వెళ్లి కష్టపడి తనను చదివించిందని గుర్తుకు చేసుకున్నాడు.తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఇంతటి విజయాన్ని సాధించానని చెబుతున్నాడు.

## వక్ఫ్ భూముల 'గుత్త'కు వేలం

**కడప సెవెన్‌రోడ్స్:** వైఎస్సార్ కడప జిల్లాలోని ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన కొన్ని భూములను ఒక ఏడాదిపాటు గుత్తకు సాగు చేసుకోవడానికి వేలం పాట నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తెలిపారు. కలెక్టరేట్‌లోని డి.బ్లాక్‌లో ఉన్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనదలిచిన వారు వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్, కడప పేరిట రూ. 10 వేల బయాన చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వేలంలో సాగుభూములు దక్కించుకున్న వారు వెంటనే గుత్త మొత్తం చెల్లించి రశీదు పొందాలన్నారు. ప్రొద్దుటూరు మండలం మోడెంపల్లె మసీదుకు సంబంధించిన తాళ్లమాపురం గ్రామం, అదే గ్రామంలోని అసూర్‌ఖానాకు చెందిన భూములను ఈనెల 26వ తేది మధ్యాహ్నం 2 గంటలకు వేలం వేస్తారన్నారు. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె, ముద్దురెడ్డిపల్లె మసీదు, అసూర్‌ఖానాలకు సంబంధించిన భూములు అదేరోజు వేలం వేస్తామన్నారు.

## క్లుప్తంగా

### 46 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని శెట్టిగుంట పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మేరువ గౌరీశంకర్ నుంచి 25, మైసూరావారిపల్లి క్రాస్ వద్ద సాధు రమాదేవి అనే మహిళ నుంచి 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

### మిద్దెపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు


మిద్దెపై నుంచి పడి గాయపడిన గంగాదేవి

మదనపల్లె రూరల్ : మిద్దెపై నుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన ఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ డీపీ జగన్ కాలనీకి చెందిన రామకృష్ణ భార్య గంగాదేవి(52) మిద్దెపైకి వెళ్లి దుస్తులు ఆరేసి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడింది. తలకు బలమైన గాయాలు కావడంతో గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు


గాయపడిన సురేంద్ర

రామసముద్రం : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుని తీవ్ర గాయాలైన సంఘటన రామసముద్రం మండలంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువబొంపల్లికి చెందిన వెంకటనరసింహులు కుమారుడు సురేంద్ర (25)రామసముద్రంలో ఆలయానికి వెళ్లి వస్తుండగా మిట్టపల్లి సమీపంలో పొలం నుంచి ద్విచక్ర వాహనంలో రోడ్డుపైకి వస్తున్న ఎగువనల్లప్పగారిపల్లికి చెందిన కళ్యాణ్ ఇద్దరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సురేంద్ర తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబీకులు సురేంద్రను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆగని భూ కబ్జాలు!

**తప్పుడు రిజిస్ట్రేషన్‌తో భూమి ఆక్రమణకు యత్నం**


చదును చేసిన భూమి

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గంలో భూ ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇక్కడి ద్వితీయ శ్రేణి నాయకులు అగ్రనాయకుల అండదండలతో కొన్ని భూములను అడ్డదారిలో ఆక్రమించి కబ్జా చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని స్వాహా చేసి విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా కూటమి నేతల కన్ను పడితే కబ్జా కావాల్సిందే అన్న చందంగా వీరి హవా నడుస్తోంది. కూటమిలో వర్గపోరు ఉన్నప్పటికీ ఇలాంటి ఆక్రమణల విషయంలో అంతా కలిసిపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాఘవరాజపురం సబ్‌స్టేషన్ వద్ద ఆర్అండ్‌బీ స్థలం, మైసూరావారిపల్లి ఈద్గా భూమి తంతంగం మరువక ముందే మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో భూములపై వీరి కన్ను పడింది. రెడ్డివారిపల్లి పరిధిలో 2001 సంవత్సరంలో బయనపల్లి గ్రామానికి చెందిన కస్తూరి వెంకటయ్య అనే వ్యక్తి 557 సర్వే నంబర్‌లో తన 1.57 ఎకరాల భూమిలో కాళహస్తి నారాయణమ్మకు 30.05 సెంట్ల భూమిని డాక్యుమెంట్ 1698- 2001లో విక్రయించి పుల్లంపేటలో రిజిస్టర్ చేశారు. కొత్తగా రెడ్డివారిపల్లికి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండడంతో కొందరి కన్ను దీనిపై పడింది. అక్రమ అగ్రిమెంట్లతో రెండు నెలల క్రితం రిజిస్టర్ అయినట్లు తెలుపుతూ అధికారులతో కుమ్మక్కై భూమిని చదును చేసి మరలా చేతులు మార్చి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

**అధికారులు న్యాయం చేయాలి..**

2001లో రిజిస్టర్ అయిన భూమిని మరలా తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసి మా భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. మేము ఇతర ప్రాంతాలలో ఉండటంతో దీనిపై కొందరు కన్నేసి ఆక్రమించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలి. వారసులుగా మాకు హక్కులు ఉన్నా రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ అయినట్లు చూపుతున్నారు. – మాధవయ్య, నారాయణమ్మ కుమారుడు

**విచారించి న్యాయం చేస్తాం..**

భూ ఆక్రమణలు మా దృష్టికి వస్తే విచారించి న్యాయం చేస్తాం. ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తాం. సంబంధిత భూమి రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – అమరనాథ్, తహసీల్దార్, రైల్వేకోడూరు మండలం.

## సైబర్ చట్టాలపై అవగాహన అవసరం

**హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్.వి.రాధాకృష్ణ కృపా సాగర్**



మాట్లాడుతున్న ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ వి.రాధాకృష్ణ కృపా సాగర్

మదనపల్లె రూరల్ : సైబర్ చట్టాలపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ అన్నారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ అండ్ సైబర్ లాపై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లను శిక్షించడం, హానికరమైన ఆన్‌లైన్ కార్యకలాపాల నుంచి ప్రజలను రక్షించడం, డిజిటల్ డేటాను భద్రపరచడం సైబర్ చట్టాల ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి. వాటిని నిరూపించాలంటే ఏఏ సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇచ్చే సాక్ష్యాలు చెల్లుబాటు అవుతాయా లేదా..? ఏఏ పద్ధతుల్లో వాటిని నిరూపిస్తే చెల్లుబాటవుతాయి. వాటిపై వచ్చే అభ్యంతరాలను ఎలా నివృత్తి చేయాలనే అంశంపై న్యాయవాదులకు పలు సూచనలు చేశారు. అనంతరం మదనపల్లె బార్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ వి.రాధాకృష్ణ కృపా సాగర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి సూర్యనారాయణమూర్తి, న్యాయమూర్తులు శ్రీలత, సుభాన్, శిరీష, కీర్తన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అమరనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.మనోహర, ఉపాధ్యక్షులు ఎ.వి.శివకుమార్‌రెడ్డి, రెడ్డి నాగులు, ఎం.ఎ.బాషా, అహ్మద్ నజీరుద్దీన్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీలో ప్రజాస్వామ్య హననం

మదనపల్లె : మదనపల్లె మండలం బుద్ధునికొండ (నల్లగుట్ట)పై జులై 2న బుద్ధుడి విగ్రహం తలనరికిన ఘటనపై కార్యక్రమాల నిర్వహణకు అనుమతి లేకపోవడంతో శనివారం తమిళనాడు, కర్ణాటకలో దళిత సంఘాలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. కర్ణాటక శ్రీనివాసపురంలో దళిత సంఘర్షణ సమితి (డి.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట సభ జరిగాయి. తమిళనాడు పేర్ణంబట్టులో వీసీకే పార్టీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించింది.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య హననానికి పాల్పడుతోందని విమర్శించారు.

### స్వయం సమృద్ధి సాధించాలి


చేనేత చీరను కొనుగోలు చేస్తున్న మెప్మా పీడీ పి. లక్ష్మిదేవి

రాయచోటి టౌన్ : స్వయం సహాయక సంఘాల ద్వారా స్వయంగా ఉత్పత్తులను తయారు చేసి వ్యాపారాలు సాగిస్తూ స్వయం సమృద్ధి సాధించాలని జిల్లా మెప్మా పీడీ పి. లక్ష్మిదేవి అన్నారు. శనివారం రాయచోటి మెప్మా కార్యాలయ ఆవరణంలో ఓపెన్ మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఇళ్ల వద్ద తయారు చేసే వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయించుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి అబ్బాస్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలపై ఆస్తిహక్కు కల్పించేందుకు స్వమిత్వ


హౌస్ హోల్డ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

సిద్దవటం : ఇళ్ల స్థలాలపై ఆస్తిహక్కు కల్పించేందుకు ప్రభుత్వం స్వమిత్వ అనే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మీ తెలిపారు. సిద్దవటం మండల పరిషత్ సభా భవనంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో స్వమిత్వపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో స్వమిత్వలో వైఎస్సార్ కడప జిల్లా నాల్గవ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, డీఎల్‌పీఓ విజయ్ భాస్కర్, ఈఓపీఆర్‌డీ మెహెతాబ్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





### భూ వివాదంలో ముగ్గురిపై దాడి

నిమ్మనపల్లె : పొలం వద్ద దారి కోసం ఏర్పడిన వివాదంలో ఒకే కుటుంబంలోని ముగ్గురిపై కొందరు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన జి.శ్రీనివాసులురెడ్డి(40)కు అదే గ్రామంలోని వెంకటరమణారెడ్డి, ఉదయ్‌శేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలతో పొలం దారి విషయమై వివాదం నడుస్తోంది. ఈ విషయమై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా అధికారులు విచారించి శ్రీనివాసులురెడ్డికి అనుకూలంగా ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. దీంతో నిమ్మనపల్లె ఎస్ఐ ప్రత్యర్థి వర్గంలోని వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి ఈ విషయమై అధికారుల సూచనల మేరకు నడుచుకోవాలని, లేనిపక్షంలో చర్యలు ఉంటాయని చెప్పి బైండోవర్ చేశారు. ఇంటికి వెళ్లిన ప్రత్యర్థులు మాపై ఫిర్యాదు చేస్తావా అంటూ శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులపై దాడిచేసి కర్రలతో కొట్టారు. దాడిలో శ్రీనివాసులురెడ్డితో పాటు అతడి భార్య యమున, సోదరి రేణుక గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

### డీఏపీ ద్రావణం పిచికారీతో మంచి దిగుబడులు

లక్కిరెడ్డిపల్లి : ప్రతి పంటకు డీఏపీ చల్లకుండా లిక్విడ్‌తో స్ప్రే చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం బి.ఎర్రగుడి పంచాయతీలోని చెంచర్లపల్లి, ఎర్రగుడి, మామిడిగారి పల్లి గ్రామాలలోని వేరుశనగ, కంది, ఆముదం పంటలకు డీఏపీ లిక్విడ్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం లీటరు రూ. 500 అని, డీఏపీ బస్తా అయితే రూ. 1700 అని లిక్విడ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏఓ రాజకుమారి, ఏఈఓ అనూష, ఆర్ఎస్ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలు

చింతకొమ్మదిన్నె : కడప-చిత్తూరు జాతీయ రహదారిపై కొలుములపల్లి సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు వద్ద శనివారం తెల్లవారుజామున కారును గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్ ప్రాంతానికి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వారు తిరుమల దర్శనం కోసం వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ నిర్లక్ష్యంగా నడిపిన కారణంగా ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ ఆపకుండా పారిపోయినట్లు సమాచారం.

### సెంచురీ పానెల్స్ పరిశ్రమను పరిశీలించిన ఆర్డీఓ


గోపవరం : సెంచురీ పానెల్స్ పరిశ్రమను ఆర్డీఓ చంద్రమోహన్ శనివారం పరిశీలించారు. తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏఓ విజయరావుతో కలిసి పరిశ్రమలో జరుగుతున్న పనులను పరిశ్రమ ప్రతినిధుల ద్వారా తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం యూరియా కొరత ఉన్నందున పరిశ్రమలో ఉపయోగించే యూరియాపై ఆరా తీశారు. పరిశ్రమలో ఉపయోగించే యూరియాను కూడా స్థానిక వ్యవసాయాధికారుల ద్వారా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయానికి వాడే యూరియా కాదని నిర్ధారించారు. అనంతరం పరిశ్రమలో తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను పరిశీలించారు.

### వరికోత వాహనం బోల్తా


గాయపడిన యువరాజ్

బి.కొత్తకోట : తమిళనాడు నుంచి ములకలచెరువు వెళ్తున్న వరికోత యంత్రం కలిగిన వాహనం బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం మండలంలోని జాతీయ రహదారి కనికలతోపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి డ్రైవర్ యువరాజ్ (30) వరికోత యంత్రంతో మదనపల్లె నుంచి ములకలచెరువు వెళ్తున్నాడు. వాహనం ఇంజిన్ బోల్టు ఊడిపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయలయ్యాయి. బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సీఐ గోపాల్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

### విద్యార్థి ఆత్మహత్య


భానుప్రకాష్ (ఫైల్)

లింగాల : లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వెలుగు భానుప్రకాష్ (22) అనే విద్యార్థి నంద్యాల జిల్లా పాణ్యం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం విద్యార్థి కళాశాల హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న భానుప్రకాష్ తల్లిదండ్రులు రాంభూపాల్, సరస్వతి హుటాహుటిన ఆర్జీఎం కళాశాల వద్దకు వెళ్లారు. అప్పటికే కళాశాల యాజమాన్యం, పోలీసులు భానుప్రకాష్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భానుప్రకాష్ శుక్రవారం ఆయన తండ్రికి తనకు ఆరోగ్యం బాగాలేదని, ఆత్మహత్య చేసుకుంటున్నానని మెసేజ్ పెట్టాడని పోలీసులు తెలిపారు. దీనిపై భానుప్రకాష్ తండ్రి తాను మెసేజ్ చూసుకోలేదని, తనకు అంతటి చదువు రాదని కళాశాల యాజమాన్యం తన కుమారుడిని ఏమో చేసిందని విద్యార్థి తల్లిదండ్రులతోపాటు, బంధువులు ఆసుపత్రి వద్ద బోరున విలపించారు.

## నల్లగుట్టపై పోలీసు పహారా

**200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు**


నల్లగుట్ట వద్ద విధి నిర్వహణలో పోలీసులు

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ సర్వే నంబర్.15లోని నల్లగుట్టపై బుద్ధ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టిస్తామని, బౌద్ధసమ్మేళనం నిర్వహిస్తామని బాస్, దళిత సంఘర్షణ సమితి నాయకులు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసిన నేపథ్యంలో...పోలీస్, రెవెన్యూ శాఖ నిషేధాజ్ఞలు విధించిన విషయం తెలిసిందే. శనివారం నల్లగుట్ట చుట్టూ 5 కి.మీ.ల పరిధిలో ప్రజలు గుమికూడకుండా, ఎలాంటి ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించకుండా పెద్దసంఖ్యలో పోలీసులు పహారా కాశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు మోహరించి, ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ మహేంద్ర సిబ్బందితో కలిసి అంకిశెట్టిపల్లె పంచాయతీలోని నల్లగుట్ట వద్ద పరిస్థితిని సమీక్షించారు. పోలీసులకు పలుసూచనలు చేస్తూ, బందోబస్తును స్వయంగా పర్యవేక్షించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందును టూటౌన్ సీఐ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## తప్పుడు పత్రాలతో భూమి కబ్జాకు యత్నం

మదనపల్లె రూరల్ : తాతల నుంచి సంక్రమించి, ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న భూమిని కొందరు తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అధికారులు తమకు న్యాయం చేయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో నీరుగట్టువారిపల్లెకు చెందిన బాధితులు మంజునాథ్, శ్రీనివాసులు, నారాయణ, వెంకటరెడ్డి, అలివేలమ్మలు మాట్లాడుతూ...కోళ్లబైలు పంచాయతీ సర్వేనెంబర్.605/6లో 2.88 ఎకరాల భూమికి 1966లో తమ తాత మొండి గంగన్న పేరుతో ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వారసత్వంగా సంక్రమించిన పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే, స్థానికంగా ఉన్న మురళీ అనే వ్యక్తి...తమ అనుభవంలో ఉన్న భూమికి మిలిటరీ పట్టా పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి, సర్వే నెంబర్లు మార్చి, రిజిస్టర్ అయిందని బుకాయిస్తూ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. భూమి ఆక్రమణకు గురికాకుండా కంచె వేసుకునేందుకు తాము ప్రయత్నిస్తే తమపై దాడికి యత్నించి, తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంలో తమకు స్నేహితుడైన హోంగార్డు రాజశేఖర్ అండగా నిలిస్తే, అతడిపై లేనిపోని నిందలు వేస్తూ డీఎస్పీకి తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాన్ని తాము ఇప్పటికే రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలను ప్రారంభించాలి


వైద్య కళాశాల నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : కూటమి ప్రభుత్వంలో మదనపల్లె వైద్య కళాశాల నిర్మాణం కాసుల కోసమే ఆగిపోయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరితో రూ.72 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. శనివారం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీపీఎం నాయకులతో కలిసి మదనపల్లెలో ఆగిపోయిన కళాశాల భవనాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లో పనులు పూర్తిచేసి 2024 లో కళాశాలను ప్రారంభించాల్సి ఉండిందన్నారు. మదనపల్లెలో రూ. 472 కోట్లతో నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పూర్తిగా నిర్మాణాలను ఆపేసి కళాశాలను ప్రారంభించలేదన్నారు. నిర్మాణ ప్రాంతంలో రూ.10 కోట్ల విలువైన సామగ్రి దుస్థితికి చేరిందన్నారు. వైద్య కళాశాల ప్రారంభం కోసం రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిశర్మ, రామకృష్ణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద దర్గాకు ఉత్సవ శోభ

**నేటి నుంచి ఉరుసు**


విద్యుద్దీప అలంకరణలో కడప పెద్దదర్గా

కడప సెవెన్‌రోడ్స్ : భక్తుల పాలిట కొంగుబంగారమై నిలుస్తూ ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక సూఫీ పుణ్యక్షేత్రమైన కడప పెద్దదర్గాకు ఉరుసు శోభ చేకూరింది. ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు దర్గా 10వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టి ఉల్ ఖాద్రి సాహెబ్ ఉరుసు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధోత్సవం, సోమవారం ఉరుసు, మంగళవారం తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారు. ఉరుసురోజు ఖవ్వాలీ కచేరీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దర్గాతోపాటు దర్గా ఆవరణం విద్యుద్దీపాలతో కాంతులీనుతూ భక్తులను ప్రత్యేకంగా ఆకర్శిస్తోంది.

## గండి క్షేత్రంలో ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు

**అమావాస్య కారణంగా చివరి శనివారం భారీగా తగ్గిన భక్తుల రద్దీ**


ఆస్థానం నిర్వహిస్తున్న వేదపండితులు

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో శ్రావణ మాసం చివరి శనివారం భక్తుల సంఖ్య భారీగా తగ్గింది. ఇందుకు అమావాస్యే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం భక్తులు వచ్చి స్వామిని దర్శించుకొని పరవశించి పోయారు. వాహనాలను పోలీసులు అద్దాలమర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే నిలిపివేశారు. దీంతో భక్తులు కాలినడకన గండికి చేరుకొని దర్శించుకున్నారు. కొందరు భక్తులు వేంపల్లె, చక్రాయపేట, నాగలగుట్టపల్లె, వేముల తదితర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం గండి శ్రీవాసవీ నిత్యాన్నదాన సత్రంతో పాటు పలు చోట్ల దాతలు పెద్ద ఎత్తున అన్నదానాలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలకమండలి సభ్యులతో పాటు ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, ఆర్కేవ్యాలీ ఎస్ఐ రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామి, వేద పారాయణం రామ మోహనశర్మలు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

**వైభవంగా స్వామి వారి క్షేత్రోత్సవం, ఆస్థానం**

శ్రావణ మాసం ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి క్షేత్రోత్సవం, ఆస్థానం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో పూలాలంకరణ మధ్య ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఉంచి మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం ఆస్థానం నిర్వహించి ఈ ఏడాది శ్రావణ మాస ఉత్సవాలను ముగించారు.

## ఇక అంతా స్పీడ్ పోస్టే!

- పోస్టల్ శాఖలో సెప్టెంబర్ ఒకటి నుంచి రిజిస్టర్ పోస్టు రద్దు
- ట్రాకింగ్ సిస్టంతో విస్తృత సేవలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దశాబ్దాలుగా పోస్టల్ శాఖలో సేవలందిస్తున్న రిజిస్టర్డ్ పోస్ట్ రద్దవుతోంది. ఈ నెలాఖరుకు రిజిస్టర్డ్ పోస్ట్ అనేది పోస్టల్ శాఖ నుంచి అంతర్ధానం కానుంది. రిజిస్టర్డ్ పోస్టును స్పీడు పోస్టులో విలీనం చేయడం ద్వారా ఈ విధానం రద్దు కానుంది. కొత్త విధానం సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా పోస్టల్ శాఖ అమలులోకి తీసుకురానుంది. ఇకనుంచి స్పీడ్ పోస్ట్ పార్సిల్ సేవలు అందించనున్నాయి. స్పీడ్ పోస్ట్ అనేది పోస్టల్ శాఖలో విస్తృత సేవలు అందిస్తోంది. కొత్తగా స్పీడ్ పోస్ట్‌లో ట్రాకింగ్ సిస్టం కూడా అందుబాటులోకి వచ్చింది. పార్సెల్ బుక్ చేసిన వ్యక్తికే కాకుండా దానిని అందుకోనున్న వ్యక్తి మొబైల్ ఫోన్‌కు పూర్తి సమాచారంతో కూడిన మెసేజ్ వస్తుంది. బుక్ పార్సిల్ ఎక్కడుంది. ఎప్పటికి అందుతుంది వంటి వివరాలు మొబైల్ ఫోన్‌లో చూసుకునే వెసులుబాటు కల్పించింది.

**సరికొత్త టెక్నాలజీ దిశగా..**

పోస్టల్ శాఖ ఇప్పటి వరకు అమలవుతున్న టెక్నాలజీ విధానాలకు స్వస్తి పలికి సరికొత్త సాంకేతిక ఆధునికతతో కూడిన ఏపీటీ 2.0 ద్వారా సేవలందిస్తోంది. జులై నెలకు ముందు పోస్టల్ శాఖ మొత్తం సేవలు కోర్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా అందేవి. వీటినే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఉన్న ఏపిటీ 2.0 అమలులోకి తెచ్చింది. కడప డివిజన్ పోస్టల్ కార్యాలయంలో పోస్టల్ సేవలను ఏపీటీ 2.0 అందించడమే కాదు వచ్చే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి విలీనమైన స్పీడ్ పోస్ట్ ద్వారా సాంకేతిక సౌకర్యాలతో సేవలందించేందుకు డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. కడప డివిజన్‌లో 2 ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి.